వినాయక నిమజ్జన కోసం క్రేన్లు

క్రేన్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ

కామారెడ్డి, సెప్టెంబర్ 14 : వినాయక నిమజ్జన సందర్భంగా భారీ వినాయకులను తీయడానికి క్రేన్లను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలీన గ్రామాల్లో గణేశ్ నిమజ్జనానికి క్రేన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో భారీ విగ్రహాలను క్రేన్ల సహాయంతో నిమజ్జనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రెడ్డీల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి ట్రస్ట్ చైర్మన్ నాగర్తి చంద్రారెడ్డి

కామారెడ్డి, సెప్టెంబర్ 14 : ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న రెడ్డిల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి ట్రస్ట్ చైర్మన్ నాగర్తి చంద్రారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో రెడ్డిల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని రెడ్డి కుటుంబ సభ్యులందరూ ఇంటికి ఒకరు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్ రెడ్డి, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, ఫస్ట్ వైస్ చైర్మన్లు గంగారెడ్డి, రాజారెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా.. పల్లె ప్రకృతి వనం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

బీబీపేట్, సెప్టెంబర్ 14 : పల్లె ప్రకృతి వనం మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ పల్లె ప్రకృతి వనం మందు బాబుల కోసమే ఏర్పాటు చేసినట్లుగా ఉందని స్థానికులు అంటున్నారు. బీబీపేట మండలం మాందాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతున్నది. మధ్యాహ్నం, రాత్రయితే చాలు మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పల్లె ప్రకృతి వనంలో కూర్చోవడానికి అనుకూలంగా ఉండడంతో మందు బాబులు అక్కడే సిట్టింగ్ చేస్తున్నారు. మందు సీసాలు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు తాగి అక్కడే పడేయడంతో పర్మిట్ రూమ్‌లా మారింది. ఉన్నతాధికారులు స్పందిస్తే మందు బాబుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

మాందాపూర్ పల్లె ప్రకృతి వనంలో తాగి పడేసిన మందు సీసాలు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు

మాందాపూర్‌లోని పల్లె ప్రకృతి వనం

వనంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కరాటే మాస్టర్లు, ఉపాధ్యాయులు

బీబీపేట్, సెప్టెంబర్ 14 : రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు కరాటే మాస్టర్ కామిండ్ల నవీన్ తెలిపారు. దోమకొండలోని ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల కరాటే పోటీలు ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ హీరాలాల్ ఆధ్వర్యంలో సీనియర్ బ్లాక్ బెల్ట్ కామిండ్ల రాజయ్య సమక్షంలో పోటీలను శనివారం నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి ప్రభుత్వ, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కామారెడ్డి, బీబీపేట, దోమకొండ మండలాలకు చెందిన 28 మంది విద్యార్థులు స్టేట్ లెవెల్ కరాటే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, బీబీపేట, దోమకొండ మండలాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హైజంప్ పోటీలకు..

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 14 : బీర్కూర్ బీసీ గురుకుల పాఠశాలకు చెందిన హరీశ్ అనే విద్యార్థి శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి హైజంప్ క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హరీశ్‌ను అభినందించారు.

మేనత్త గొలుసు చోరీ

వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి, సెప్టెంబర్ 14 : ఈనెల 2న గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గజ్యానాయక్‌తండాకు చెందిన పందిరి రాజవ్వ ఒక్కతే ఇంట్లో ఉంటుంది. ఆమె అల్లుడు మ్యాడం సంతోష్, గడిముందటి మానస కలిసి పందిరి రాజవ్వ మెడలో నుంచి పుస్తెల తాడును దొంగిలించారు. ఎస్సై అనిల్ వాహనాలు తనిఖీ చేస్తుండగా సంతోష్, మానస బైక్ పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని విచారించినట్లు తెలిపారు. దొంగిలించిన బంగారాన్ని అమ్మడానికి వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సంతోష్ కు అప్పులు ఎక్కువ కావడంతో సమీప బంధువు అయిన రాజవ్వ ఇంట్లోకి చోరీకి ప్లాన్ వేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'అయాచితం' మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

అయాచితం నటేశ్వరశర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెరవే నాయకులు

కామారెడ్డి, సెప్టెంబర్ 14 : తెలంగాణ గర్వించదగ్గ మహాకవి అయాచితం నటేశ్వర శర్మ మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని కామారెడ్డి కవులు అభిప్రాయపడ్డారు. కామారెడ్డిలోని సీనియర్ సిటిజన్ కార్యాలయ భవనంలో ఇటీవల స్వర్గస్తులైన ప్రముఖ కవి, రచయిత అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ సంస్మరణ సభను శనివారం తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి ఆధ్వర్యంలో తె.ర.వే. జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేదపండితుడు ఆంజనేయ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత కాలంలో 56 గ్రంథాలు రాసి 1,500 అష్టావధానాలు చేసి కామారెడ్డి ఖ్యాతిని విశ్వ వ్యాప్తం చేసిన మహనీయుడు అయాచితం నటేశ్వరశర్మ అని అన్నారు. మాజీ టీఎస్పీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ.. అయాచితం నటేశ్వరశర్మ సాహితీ సలహాల ద్వారా ఎంతో మంది సాహిత్యంలో రాణిస్తున్నారని, సాహితీ గురువుగా అభివర్ణించారు. కార్యక్రమంలో ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ ప్రసాద్, మంద పీతాంబర్, తిరుపతిరావు, రాంచంద్రం, కాశి నర్సయ్య, అంబీర్ మనోహర్ రావు, సుధాకర్, ప్రభాకర్, పబ్బ విజయశ్రీ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బిచ్కుంద, సెప్టెంబర్ 14: బిచ్కుందలో ఐటీఐ కాలేజీలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్‌లో 11సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 8వ తరగతి పాసైన యువత ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో బిచ్కుందలోని ఐటీఐ కాలేజీలో సంప్రదించాలని సూచించారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- బిచ్కుంద సీఐ జగడం నరేశ్
- నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బిచ్కుందలో కమ్మరి చెరువు కట్ట పై వినాయక నిమజ్జన ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలిస్తున్న సీఐ జగడం నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద, సెప్టెంబర్ 14: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బిచ్కుంద సీఐ జగడం నరేశ్ అన్నారు. బిచ్కుందలో గణేశుడి నిమజ్జన ఏర్పాట్లను ఆయన స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. శోభాయాత్ర మార్గంలో రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని, విద్యుత్ వైర్లు సరిచేయాలని సంబంధిత శాఖల సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. చిన్న పిల్లలను బారికేడ్లను దాటి చెరువులోకి రానివ్వొద్దన్నారు. గజ ఈతగాళ్లతోపాటు క్రేన్‌ను చెరువు వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఆయనవెంట ఎస్సై మోహన్‌రెడ్డి, ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు.

వినాయకుల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానాలు

ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట/ గాంధారి/కామారెడ్డి/భిక్కనూరు/ బీబీపేట్/బాన్సువాడ, సెప్టెంబర్ 14: ఎనిమిది రోజులుగా వినాయకుడు భక్తుల విశేష పూజలను అందుకుంటున్నాడు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాత్రి సమయంలో భజనలు కొనసాగుతున్నాయి. శనివారం పలు వినాయక మండపాల వద్ద కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. ఎల్లారెడ్డిలోని శ్రీకృష్ణ వినాయక మండలి వద్ద కుంకుమార్చన, మంగళమూర్తి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద వినాయకుడి వద్ద, ఎర్రమన్ను కుచ్చ మండ్రు కాలనీలో అన్నదానం చేశారు.

నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్, అక్కంపల్లి, గోపాల్‌పేట, ఆత్మకూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆత్మకూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో, మండల కేంద్రంలోని జేఎస్ఎమ్ దవాఖాన వద్ద భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. గాంధారిలోని హిందూ దళ్, పవన్ యూత్‌తోపాటు పలు కాలనీల్లోని వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఉన్న విద్యుత్ నగర్ కాలనీలోని శ్రీగణేశ్ మండలి ఆధ్వర్యంలో శనివారం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి 28 రకాల స్వీట్లు, ప్రసాదాల నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కామారెడ్డిలోని స్వప్నలోక్ కాలనీలోని గణేశ్ మండలి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనలో పాల్గొన్నారు. భిక్కనూరులో హిందూ దళ్, వందేమాతరం యూత్ క్లబ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహులు పాల్గొన్నారు. బీబీపేట్‌తోపాటు మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తుల కోసం అన్నదానం చేశారు. బాన్సువాడతోపాటు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. మండపాల వద్ద దాండియా, నృత్యాలు, చిన్నారుల కోలాటం, భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం తొమ్మిది రోజులు కావడంతో పలు చోట్ల గణనాథులకు నిమజ్జనాలు చేయనున్నారు.

కామారెడ్డిలోని స్వప్నలోక్ కాలనీలో గణేశ్ మండలి వద్ద నిర్వహించిన కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అక్కంపల్లిలో వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న దంపతులు

కొల్లూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

గాంధారిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

భిక్కనూరులో..

కామారెడ్డిలో..

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అనఘా షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్ (M/F), అర్హత (డిగ్రీ) సాలరీ 15,000/- Month మరియు అనుభవం గల ఎలక్ట్రిషన్ (డిప్లొమా ఎలక్ట్రిషన్) సాలరీ 15,000/- Month కావలెను. ఆసక్తిగలవారు వెంటనే ఐడి ప్రూఫ్, ఫోటో, స్టడీ సర్టిఫికేట్‌తో నేరుగా సంప్రదించగలరు.

NTZ-340395

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పలు గ్రామాల్లో బీకేఎస్ కార్యవర్గాలు ఎన్నిక

లింగంపేట, సెప్టెంబర్14: మండలంలోని ముస్తాపూర్, ఎల్లారం, పోతాయిపల్లి గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాలను ఎన్నుకున్నట్లు సీజీఆర్ఎఫ్ సభ్యుడు రాజాగౌడ్ శనివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించిన అనంతరం కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ముస్తాపూర్ గ్రామ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా చిన్న కాంతం, ప్రధాన కార్యదర్శిగా అశోక్ ఎన్నికయ్యారు. పోతాయిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆకుల సాయిరాం, ఉపాధ్యక్షుడిగా వెల్పుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా నీరడి భూమయ్య, ఎల్లారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ప్రభులింగం, ఉపాధ్యక్షుడిగా నడిపి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల సంగయ్య ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల శాఖ అధ్యక్షుడు రాజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బలరాముడి చిత్ర పటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించిన భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు.

లడ్డూలకు వేలం

జంగంపల్లిలో రూ.32వేలకు దక్కించుకున్న లడ్డూతో జనార్దన్

భిక్కనూరు/ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 14 : భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామశివారులో ఉన్న రాఘవ ఫార్మా కంపెనీలో వినాయకుడిని ప్రతిష్ఠించగా శనివారం లడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెంది జనార్దన్ అనే వ్యక్తి రూ 32 వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నాడు. నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో వినాయక మండప నిర్వాహకులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని సబ్బల్‌పూర్ గ్రామంలో వినాయకుని లడ్డూను అదే గ్రామానికి చెందిన నారాయణ రూ.29 వేలకు వేలంలో దక్కించుకున్నాడు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

లింగంపేట, సెప్టెంబర్ 14: లింగంపేటలోని నాగన్న బావి వద్ద అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనా రమేశ్ అధికారులకు సూచించారు. నాగన్న బావి వద్ద చేపడుతున్న పనులను ఆమె శనివారం పరిశీలించారు. మిగిలిన పనులు రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీన ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. బావి పూడిక తీస్తున్న సమయంలో బయట పడిన విగ్రహాలను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట డీఆర్డీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు అశోక్, నగేశ్‌తో పాటు ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగన్న బావి వద్ద పనులు పరిశీలించి సూచలను చేస్తున్న రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పన రమేశ్

రూ.33 లక్షల విలువైన

అల్ఫాజోలం పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 14: నిందితుల నుంచి రూ.33లక్షల విలువైన అల్ఫాజోలంను పట్టుకున్నట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలం వదల్పర్తి రూట్‌లో నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, ఎల్లారెడ్డి ఎస్‌హెచ్‌వో బృందం రూట్ వాచ్ చేస్తున్నదని తెలిపారు. 3.340కిలోల అల్ఫాజోలంతో దొంతి లక్ష్మీనారాయణ (రుద్రారం), భీమగోని ప్రవీణ్‌గౌడ్ (గాంధారి), బండారి సిద్ధిరామాగౌడ్ (మాటూరి మాసానిపల్లి) పట్టుబడ్డారని తెలిపారు. వీరి నుంచి ఒక యూనికార్న్ ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితోపాటు ఉన్న మరో నిందితుడు బాబాగౌడ్ (మాటూర్ మాసానిపల్లి) పరారీ అయ్యాడని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.